క్లుప్తంగా

పెంపుడు జంతువులకు టీకాలు నేడు

రణస్థలం : సంక్రమిత వ్యాధులు దినోత్సవం (వరల్డ్ జూనోసిస్ డే) సందర్భంగా ఈ నెల 6న రణస్థలం ఏరియా పశు సంవర్ధకశాఖ ఆస్పత్రి ఆవరణలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయనున్నట్లు ఏడీఏ బి.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెట్స్ యజమానులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మహంతిపాలెంలో కుటుంబాన్ని పరామర్శిస్తున్న పిన్నింటి సాయికుమార్

రణస్థలం: వి.ఎస్.పురం పంచాయతీలో వాకాడ సింహాద్రి, మింది చిన ఆదినారాయణ, రిటైర్డ్ వీఆర్వో లక్ష్మణరావుల అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయా కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ శనివారం పరామర్శించారు. మహంతిపాలెంలో కోరాడ అప్పలనాయుడు, రణస్థలంలో ఎన్ని పైడితల్లి, అర్జునవలసలో బోర్‌మెకానిక్ బొమ్మలాట రాము భార్య ఇటీవల మరణించారు. ఆ కుటుంబాలను కూడా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



శ్రీకాకుళం కల్చరల్ బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో పది రోజులుగా నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మొండేటివీధిలో వారాహి అమ్మవారికి 100 రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు.

శ్రీకాకుళం ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా సంతోష్



శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటొ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా పి.సంతోష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పలాస డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన వి.రమేష్ పాలకొండ డిపోకు అసిస్టెంట్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానుకూలంగా బస్సులు నడిపి ప్రయాణికులకు ఇబ్బందులూ కలగకుండా చూస్తానని పేర్కొన్నారు.

మనోనిగ్రహంతో మెలగాలి



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాల్లో భాగంగా శనివారం 'భక్తి స్వరూపం–కాలమహిమ' అనే అంశంపై డి.జి.పట్నాయిక్ ప్రసంగించారు. భాగవతంలో ప్రధాన అంశం భక్తి, భక్తులు, భగవంతుడని చెప్పారు. తామసిక, రాజసిక, సాత్విక భక్తులు ఉంటారని, అహింస, సహనం, భూత దయ, మనోనిగ్రహం కలిగి ఉండాన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కోమలరావు, విశ్వేశ్వరరావు, మోహనరావు, ఈశ్వరరావు, నరసింహమూర్తి, బాబూరావు, వసంతరావు, అరుణకుమారి, లక్ష్మీ, సరస్వతి పాల్గొన్నారు.

క్లోరినేషన్ పనుల పరిశీలన

ఎచ్చెర్ల : లావేరు మండలం గుంటుకుపేటలో తాగునీటి క్లోరినేషన్ పరీక్షలను ఎంపీడీవో పి.వెంకటరాజు శనివారం పరిశీలించారు. వ్యాధుల సీజన్ నేపథ్యంలో నీటిని మరిగించి తాగాలన్నారు. బోర్లు, కుళాయిల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎల్.పద్మజ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హరికథలు.. విందాం రండి!

- నేటి నుంచి హరికథ నవరత్నాలు
- బాపూజీ కళామందిర్ వేదికగా తొమ్మిది రోజుల పాటు నిర్వహణ
- కళాకారుల సేవలో సుమిత్రా కళాసమితి
- 2014 నుంచి హరికథా సప్తాహాలు



సిద్ధమైన బాపూజీ కళామందిర్

శ్రీకాకుళం కల్చరల్: ప్రస్తుత సోషల్‌మీడియా యుగంలో రానురాను రంగస్థల కళలకు ఆదరణ కరువవుతోంది. కళాకారులను ఆదరించేవారు కరువయ్యారు. ముఖ్యంగా హరికథ వంటి పురాతన కళలు ప్రదర్శించే వేదికలు అరుదుగా కనిపిస్తున్నాయి. ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయంలో తప్ప ప్రత్యేకంగా వీటికి వేదికలు ఏర్పాటు చేస్తున్నది తక్కువనే చెప్పాలి. ఈ తరుణంలో దాతల సహకారంతో రంగస్థల కళలకు ఊతమివ్వాలనే తలంపుతో 2014 నుంచి శ్రీకాకుళం నగరానికి చెందిన సుమిత్రా కళాసమితి సభ్యులు నడుం బిగించారు. ఒక్క నాటక కళే కాకుండా అన్ని కళలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. నాటి నుంచి ప్రతి ఏడాది హరికథల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. హరికథా సప్తాహాలు, అష్టదళ పద్మం వంటి పేర్లతో వారం పాటు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది హరికథ నవరత్నాల పేరిట వివిధ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధ హరి కథకులను నగరానికి రప్పించి వారిచే ప్రదర్శనలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తొమ్మిది రోజులు.. తొమ్మిది కథలు..

2014లో హరికథా సప్తాహం పేరుతో ఏడు రోజులు ఏడుగురు హరికథకులచే ప్రదర్శనలు ఇప్పించారు. 2015, 2016లోనూ హరికథా సప్తాహాలు జరిగాయి. 2017లో వినూత్నంగా తిరుపతికి చెందిన విజయకుమారి భాగవతారిణిచే 12 రోజులు 'మహాభారత కథ'ను ప్రదర్శింపజేశారు. 2018లో సప్తాహం, 2019లో అష్టదళ పద్మం పేరుతో 8 మంది భాగవతార్‌లచే 8 రోజులు హరికథలను నిర్వహించారు. ఈ ఏడాది హరికథా నవరత్నాల పేరుతో 9 రోజులు 9 మంది హరికథా బాగవతార్‌లచే భారత భాగవత కథలను చెప్పించేందుకు రంగం సిద్ధం చేశారు.

ఈ ఏడాది ప్రదర్శనలివే..

సుమిత్రా కళాసమితి సభ్యులు, హరికథలపై డాక్టరేట్ పొందిన డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు సంస్మరణార్థం ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు తొమ్మిది మంది హరికథా భాగవతార్‌లతో శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ నెల 6న గుంటూరుకు చెందిన తిరువళ్లూరి దివ్య శివ భాగవతారిణిచే 'సుందరకాండ', 7న నెల్లూరుకు చెందిన కొండపల్లి విశ్వనాథం భాగవతార్‌చే 'తులసీ జలంధర', 8న హైదరాబాద్‌కు చెందిన కాకర్ల హనుమంతరావు భాగవతార్‌చే 'సీతా కల్యాణం, 9న కర్నూలుకు చెందిన టి.సాయిరాం భాగవతార్‌చే 'భూకైలాస్', 10న కర్నూలుకు చెందిన రవి ప్రసాదరాజు భాగవతార్‌చే 'మార్కండేయ చరిత్ర', 11న హైదరాబాద్‌కు చెందిన బి.లక్ష్మీనారాయణ భాగవతార్‌చే 'పార్వతీ కల్యాణం', 12న తెనాలికి చెందిన సీహెచ్ శివపార్వతి భాగవతారిణిచే 'ప్రమీలార్జునీయం', 13న అనకాపల్లికి చెందిన తోట తులసీ భాగవతారిణి చే 'శివపర్యటన', 14న తిరుపతికి చెందిన మద్దపట్ల ఉషారాణి భాగవతారిణిచే 'శ్రీకృష్ణరాయభారం' హరికథ ప్రదర్శనలు జరగనున్నాయి.



హరికథ (ఫైల్)

అన్ని కళలకు ప్రోత్సాహం



అన్ని కళలకు ప్రోత్సాహం కలిగించడమే మా సంస్థ ఉద్దేశం. కళాకారులకు సాయం కూడా అందిస్తున్నాం. మాకృషికి దాతల సహకారం మరువలేనిది.

– ఇప్పిలి శంకరశర్మ, అధ్యక్షుడు, సుమిత్రా కళాసమితి

సైకిల్‌పై ఏరువాకకు..



పంట పొలాల్లో దుక్కి దున్నడానికి సాధాణంగా పశువులతో నాగలి(ఏరు)ను తీసుకెళ్తారు. ఓ రైతు మాత్రం తన సైకిల్‌పై ఏరు వేసుకుని వెళ్లడం ప్రత్యేకంగా నిలిచింది. శనివారం పెంట–నాగవలస గ్రామాల మధ్య ఓ రైతు ఇలా సైకిల్‌పై వెళ్తూ కనిపించారు. – జి.సిగడాం

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కళాశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో మోహనరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని బగ్గు సరోజిని ఆసుపత్రి సమీపంలో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో త్రుటిలో అగ్నిప్రమాదం తప్పింది. విద్యుత్ మీటరు పక్కనుండే మెయిన్‌ప్యానెల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని, కళాశాల సిబ్బంది మంటలార్పేయేడంతో పెనుప్రమాదం తప్పిందని జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, ఏడీఎఫ్‌వో కె.శ్రీనుబాబు తెలిపారు.

గిరి ప్రదక్షిణకు జిల్లా భక్తులు

- సుమారు 70 వేల మంది వెళ్లే అవకాశం
- ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయం

శ్రీకాకుళం: సింహాచలంలోని వరహాలక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ ఈ నెల 9,10 తేదీల్లో జరగనుంది. సుమారు 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణకు శ్రీకాకుళం జిల్లా నుంచి సుమారు 70 వేల మంది భక్తులు వెళ్లే అవకాశముంది. ప్రతీ ఏటాలానే ఈసారి కూడా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సుతో ఇతర పట్టణాలు నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రద్దీ తీవ్రంగా ఉండటంతో ఆహార పదార్థాలకు కొంత ఇబ్బంది పడకుండా ఉండేలా భక్తులు జిల్లా నుంచే కొన్ని తినుబండారాలను, మంచినీరు, ఓఆర్ఎస్, అవసరమైన మందులను తీసుకువెళ్లాలని భక్తులకు అధికారులు సూచనలిస్తున్నారు.

సకాలంలో సాగునీరు అందించాలి



శిథిల కల్వర్టుల విషయమై అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

జి.సిగడాం : ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో సాగునీరు, పూర్తిస్థాయిలో ఎరువులు అందించి రైతులను ఆదుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, పెద్ది శ్రీనివాసరావు, గేదెల వరలక్ష్మి, బెవర విజయలక్ష్మి, మక్క శ్రీలత, పరశరాపు మంగమ్మ కోరారు. శనివారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో యూరియా లభించక మొక్కజొన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాజాం– చిలకపాలెం ప్రధాన రహదారి నుంచి సంతవురిటి మీదుగా విజయరాంపురం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని, శిథిల కల్వర్టుల మీదుగా రోడ్డు పనులు చేస్తున్నారని, దీంతో పొలాల్లోనే నీరు ఉండిపోతోందని సంతవురిటి, దవళపేట గ్రామ సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సచివాలయాల్లో కొందరు సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పాలఖండ్యాం సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, ధర్మారాజ్ చెప్పారు. గ్రామాల్లో వివిధ రకాల భవనాలు, రోడ్లు పనులు చేయించినా ఇంతవరకు ఎటువంటి బిల్లులు చెల్లించలేదని సర్పంచ్‌లు పున్నాన సోనియా సాకేటి నాగరాజు, కంది రమాదేవి, బత్తుల వెంకట కృష్ణారావు, తిరుమరెడ్డి వెంకటరావు, గోక మహేశ్వరరావు, విక్రం కోటిబాబు, తొత్తడి రామారావు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, ఐసీడీఎస్ పీఓ డోల పాపినాయుడు, డీటీ ఎస్.నిర్మల, వ్యవసాయశాఖ అధికారి బెండి బాబ్జీ, వైద్యులు పేకల సుమబిందు, ప్రతిజ్ఞ శర్మ, యు.సుమన్, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఏఈఈలు లతాశ్రీ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు గౌరవభృతి చెల్లించాలి



వినతిపత్రాలను అందిస్తున్న ఎంపీటీసీ సభ్యులు

జి.సిగడాం: ఎంపీటీసీలకు తక్షణమే గౌరవ భృతి మంజూరు చేయాలని పలువురు సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ మీసాల సత్యవతి, జెడ్పీటీసీ కాయల రమణ, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావుకు వినతిపత్రాలను అందించారు. ఇప్పటికే జిల్లా ఉన్నత అధికారులకు వినతిపత్రాలు అందించామని, ఇంతవరకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, పెద్ది శ్రీనివాసరావు, కీర్తి తవుడమ్మ, తిరుమరెడ్డి విజయలక్ష్మి, కుదిరెళ్ల సుజాత, బెవర విజయలక్ష్మి, గేదెల వరలక్ష్మి పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

రణస్థలం : ఒడిశా నుంచి విజయనగరం అలమండ సంతకు అనుమతి లేకుండా వ్యాన్‌లో తరలిస్తున్న 15 పశువులను జె.ఆర్.పురం పోలీసులు పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద శనివారం పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

56 రకాల వంటలతో నైవేద్యం



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం 56 రకాల పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా సంతోషిమాత జయంతి



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న అమ్మవారి జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం 108 లీటర్ల పాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. అర్చకులు మోదు కూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో చండీపారాయణలు, 13 పట్టుచీరలు, 56 రకాల విశేష ద్రవ్యాలతో చండీహోమం చేసి పూర్ణాహుతి నిర్వహించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జోగినాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓఎస్ఏ డాక్టర్ గోవిందరావు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రమశిక్షణతో మెలిగితే 80 ఏళ్ల సుఖంగా జీవించవచ్చునన్నారు. విద్యనేర్పిన ఉపాధ్యాయులు, కని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులకు అందరం రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దన్ సాయి, జాడ ప్రసాద్, అలికాం ప్రసాద్, బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

జయహో జగన్నాథ..



గుజరాతిపేటలో శ్రీరామపట్టాభిషేక అవతారం



పొంద్రంగివీధిలో వేంకటేశ్వరునిగా..

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని జగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా గుజరాతిపేటలో స్వామివారు శనివారం శ్రీరామ పట్టాభిషేక అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుభద్ర, బలభద్రులతో పాటు జగన్నాథస్వామిని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేశారు. మొండేటి వీధిలోని షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో రథయాత్ర సందర్భంగా స్వామివారిని శేషపాన్పు అవతారంలో అలంకరించారు. 56 రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు. పొంద్రంగివీధి రామమందిరంలో స్వామివారిని వేంకటేశ్వరునిగా అలంకరించారు.

వెంకన్నకు విశేష పూజలు



నారాయణ తిరుమలలో పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్ : పీఎస్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామివారికి అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి పూజలు చేశారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని పూలమాలలతో అలంకరణ చేశారు. మొండేటివీధి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు జరిగాయి.

వివాదాలకు కేంద్రంగా..!

- కేంద్రీయ విద్యాలయంలో గందరగోళం
- ఉన్నతాధికారి తీరుపై ఆరోపణలు
- ప్రశ్నించిన వారిపై కక్షపూరిత చర్యలు



పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని పెదపాడు పరిధిలో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఇక్కడి ఉన్నతాధికారి తీరుపై ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. విద్యాలయానికి సంబంధించిన నోటిఫికేషన్లు, మిగులు సీట్లు, అడ్మిషన్ల ప్రక్రియ బయటకు పొక్కకుండా సదరు అధికారి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు 890 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకే ఏడాదిలో సుమారు 70 మంది విద్యార్థులు టీసీలు పట్టుకువెళ్లిపోయారు. విద్యార్థులపై, ఉపాధ్యాయులపై సైతం కక్షపూరిత చర్యలకు పాల్పడటమే ఇందుకు కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

షోకాజ్ నోటీసులంటూ బెదిరింపులు..

ఉపాధ్యాయులు పొరపాటున ఆలస్యంగా వచ్చినా షోకాజ్ నోటీసులు ఇస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ కొందరు ఉపాధ్యాయులు చెబుతున్నారు. గార్డులు, క్లాస్‌ఫోర్ సిబ్బంది చేయాల్సిన పనులను సైతం తమకే అప్పగించడంతో విధుల నుంచి పూర్తిగా బయటకు వచ్చేందుకు కొందరు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. పీఎం నిధులు కింద విడుదలైన కొన్ని లక్షల రూపాయల నిధుల్లో కొంత దారిమళ్లింపు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్పోర్ట్స్ మెటీరియల్ కింద నాసిరకం మెటీరియల్ కొనుగోలు చేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతునఆనయి. మెటీరియల్ బాగోలేదని ప్రశ్నించగా పనిష్మెంట్ ఇచ్చారని పలువురు విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రశ్నించానని..

పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో మూడేళ్ల పనిచేశాను. కలెక్టరేట్‌లో ఓ ఉన్నతాధికారి అండదండలతో ఇక్కడ అవినీతి పెచ్చుమీరుతోంది. ఇక్కడి ఉన్నతాధికారిని ప్రశ్నించినందుకు నన్ను విధుల నుంచి తొలగించారు.

– దొంక సంతోష్‌కుమార్, పీఈటీ టీచర్

అవన్నీ ఆరోపణలే..

కేంద్రీయ విద్యాలయంలో ఎటువంటి అవినీతి జరగలేదు. అవన్నీ ఆరోపణలే. ఏవైనా వివరాలు కావాలంటే స్కూల్‌కి నేరుగా వచ్చి సంప్రదించవచ్చు.

– సోయాబ్ ఆలం, ప్రిన్సిపాల్

బుడుమూరు పాఠశాలలో పోటీలు

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో శనివారం తల్లికి వందనం పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం పథకం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ పోటీలు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు రవ్వ పూర్ణచంద్రరావు తెలిపారు.